# సత్యభామ స్వప్నం

— ఆచంట జానకీరామ్



శ్రీకృష్ణుడు అప్పుడే ఉదయ స్నానము చేసి వచ్చి కూర్చున్నాడు. అతని ప్రక్కనే, జరీ అంచు తెల్లపట్టుచీర ధరించిన సత్యాదేవి ఆశనయై ఉండి, అతని సేద తీర్చడానికి తన పైట కొంగు మెల్లగా వినురుతున్నది. తన సరసనున్న అతనిని చూస్తుండగా ఆమె మనస్సు వర్ణింవనలవికాని సంతుష్టితో నిండిపోతుంది. "ఇతడు నావాడు; నే నెంతటి ధన్యురాలను! ఇతడు నన్ను విడచి ఒక్క నిమిషమైన ఉండక ఉండిపోవడము ఎంత అదృష్టము!! భర్తను ఇంతగా తన చెప్పుచేతులలో ఉంచుకోకలిగి ఉండుట ఎంతటి ఘనత!!" ఈ రీతిని సాగుతున్నాయి ఆమె ఆలోచనలు. ఆ ధోరణి గ్రహించే కాబోలు శ్రీకృష్ణుడు తనలో తాను నవ్వుకుంటున్నాడు. ఆ నవ్వు అతని ముఖారవిందమున అందమైన చిరునగవుగా ప్రకటిత మగుతోంది. సత్యాదేవి ఏమో అనబోయింది. బహుశా తనలోని సంతుష్టిని గురించే అతనికి తెలియజేస్తూ అతనిని తనకు మరింత దగ్గరగా చేర్చుకోవాలను కుంటోంది కాబోలు!

ఇంతలో చటుక్కున నారదమునీంద్రులు ఆ దంపతుల ఎదుట అవతరించాడు. మరీ ఉదయపు పూట కాబట్టి, దాసీలు అట్టహాసముతో మౌని చంద్రుని ప్రవేశమును గురించి ముందుగా ప్రకటించడానికి అవకాశం లేకపోయింది. అంతేగాక వారిద్దరి ఎడల అతనికున్న చనువు అటువంటిది!!

మునివర్యుని చూచి శ్రీకృష్ణుడు వెంటనే లేవబోయాడు. సత్యాదేవిన్నీ భర్త ననుసరించి నారదునికి నమస్కరించింది.

ఉన్నట్టుండి, నారదుడు భూమికి వంగి శ్రీకృష్ణునికి సాష్టాంగ ప్రమాణము చేశాడు. శ్రీకృష్ణుని పాదపద్మములను మరీ మరీ తన లలాటముతో తాకి కృష్ణపరమైన పొగడ్తలను పొగడసాగాడు. శ్రీకృష్ణుడు నారదుని లేవనెత్తడానికి ప్రయత్నించలేదు. అతని ముఖము మాత్రము నారదుని దెస ప్రేమ ప్రభావముతో నిండిపోతోంది.

సత్యకు పట్టరాని ఆశ్చర్యము కలిగింది. సాధారణముగా నారదుడు వారి వద్దకువస్తే వారే అతనికి ప్రణమిల్లి మునీంద్రుని ఆశీర్వాదమును పొంది, ఆయనను సత్కరించుట ఆచారము. ఈ రోజు గురువరుళ్ళే శ్రీకృష్ణునికి సాష్టాంగ ప్రమాణము చేస్తూ ఉండిపోవడము ఆమెకు ఎంతైనా ఆశ్చర్యాన్ని కలిగించింది. నిమిషమునకొక క్రొత్త పొగడ్తతో శ్రీకృష్ణుని పరమాత్మ స్వరూపాన్ని ఆరాధిస్తున్నాడు.

ఎంతోసేపటికి, నారదుడు లేచి, భక్తి పారవశ్యమున చెమ్మగిల్లిన కనులను తన కాషాయాంబరముతో ఒత్తుకుంటూ అన్నాడు. 'ఎంత సుదినము స్వామీ! అనన్య లభ్యమైన మీ దర్శనభాగ్యము నాకు ఇలా లభిస్తూ ఉండడము ఎంతటి పుణ్యఫలము' అంటూ ఇక మాటాడక శ్రీకృష్ణనామస్మరణ చేసుకుంటూ వెళ్ళిపోయాడు నారదుడు. వెళ్ళేముందు, శ్రీకృష్ణుని సరసనున్న సత్యభామను తన కన్నులతో ఆశీర్వదించి వెళ్ళేడు ముని.

నారదుడు ప్రకటించిన అపరిమిత భక్తి భావమువల్ల సత్యాదేవికి అవకాశము లభించలేదు, అతనికి అతిథ్యమిస్తూ, తగిన సపర్యలు చేయడానికి... ఎంతో త్వరగా మాయమయ్యాడు వారిద్దరి ఎదుటనుండి ఆ దేవముని.

అతడు వెళ్ళిన వేపే చూస్తూ ప్రతిమలా నిలచిపోయిన సత్యను కూర్చుండబెట్టి ఆమెను ప్రశ్నించాడు శ్రీకృష్ణుడు, చిరునవ్వుతో - "ఏమిటంతగా ఆశ్చర్యపోతున్నావు దేవీ" అని.

మొదట సత్య ప్రత్యుత్తర మియ్యలేదు. కానీ, శ్రీకృష్ణుడు మళ్ళా అడుగగా ఆమె అన్నది నేలవేపు చూస్తూ! "చిత్రము! మునీశ్వరునకు మీ యందు ఇంతటి భక్తిపారవశ్యమా - సాక్షాత్కరించిన దేవుడే మీరు - అతనికి, అనినట్లనిపించింది" అని.

శ్రీకృష్ణుడు మాట్లాడలేదు, కాని సర్వజ్ఞుడైన అతను మనసులో అనుకుంటూన్నాడు. "అవును, నేను నీకు భర్తను, స్నేహితుడను, నీవాడను - నా సర్వస్వమునకు నీవే అధికారిణివి. అతనికి మాత్రము నేను దేవుడను!" అని.

దంపతులిద్దరూ ఇలా వుండగా, ఉన్నట్టుండి వారికి దివ్యసంగీతము వినిపించింది. ఎంతో దూరము నుంచి ఐనా, ఆ దూరాన్ని ఛేదించుకుని మాటలు సుశ్రావ్యమైన సంగీతముతో వినిపింపసాగినవి.

"గిరిధరకే ఘర్‌జావూఀ గిరిధర ఘర్‌కే ఘర్ జావూఀ!

పాటను వింటూన్న సత్యభామ శ్రీకృష్ణుని కుడిచేతిని గట్టిగా పట్టుకొని సన్నని స్వరముతో ఆశ్చర్యముతో నిండిన కించిత్ అసూయాభావముతో అన్నది సత్య:

"ఎవరో మీ భక్తురాలు! మిమ్ములను గురించి ఉదయసంకీర్తనము చేస్తోంది" అని, ఇంకా ఏమో చెప్పబోతూన్న ఆమెను చేసంజ్ఞతో వారించి "విను సత్యా!" అన్నాడు శ్రీకృష్ణుడు.

"గిరిధర హమారే సాంచే ప్రియతమ-"

"ఆమె ఎవరు? ఎంతటి భక్తిభావము పొర్లిపోతున్నది. ఆమె కంఠస్వరములో" అని ప్రశ్నించింది సత్యాదేవి.

శ్రీకృష్ణుడు ఆలోచనలోంచి లేచిన వానిలా తల వంకిస్తూ, "మీరా! మీరాదేవి!! చిత్తూరు రాణా కుంభరాణా దేవేరి!! శ్రీకృష్ణ తన్మయత్వమున అలా పాడుకుంటోంది. విన్నావా? ఎంతటి ఆత్మార్పణమో ఆమె సంకీర్తనములో" అన్నాడు.

సత్య వెంటనే బదులు చెప్పలేదు.

కాని, కొంత తడవైనాక, నాథుని రెండు చేతులూ పట్టుకొని అర్థించింది.

"నేను ఆమెను చూడాలి!" అని, "ఇప్పుడే!!" అన్నది సత్యభామ.

"నిజంగానా" అన్నాడు శ్రీకృష్ణుడు.

"అవును! తక్షణము మనము అక్కడకు వెళ్ళాలి" అన్నది సత్యభామ, పట్టుదలతో.

శ్రీకృష్ణుడు మళ్ళా అడిగాడు "నిజంగా నీకు మీరా దేవిని చూడాలని ఉన్నదా?" అని, అతని ప్రశ్నలో అపరిమితమైన వాత్సల్యము స్ఫురించింది.

"కళాకారుడు ప్రకృతి ప్రియుడు. అందువల్లే ప్రకృతికి బానిస అవుతాడు ... నిర్దేశకుడూ అవుతాడు" అన్నారు రవీంద్రనాథ్ టాగూర్. **ఆచంట జానకిరాం** గారి రచనల్లోను, వ్యక్తిత్వంలోనూ ఆ 'కళాకారుడే' కనిపిస్తాడు. 'సాగుతున్న యాత్ర'లోని ఆయన జీవన యాత్రానుభావాలు, కథలు, వ్యాసాలలో ఆయన కురిపించిన కవితా సౌరభాలు, చిత్రీకరించిన మనోజ్ఞభావనలు - రసజ్ఞుల హృదయాల్లో వెన్నెల దీపాలు. ఇటీవలే (ఫిబ్రవరి 24) కీర్తి శేషులైన శ్రీ ఆచంట జానకిరాం గారి స్మృతికి అంజలి ఘటిస్తూ - ఈ పేజీలలో ప్రచురిస్తున్న రచన - ఆయన భావనాసరళికి దర్పణం

'ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ ఎ జాయ్ ఫరెవర్' అన్నారు జాన్‌కీట్స్. జానకిరాం గారి రచనలు మిగిల్చే అనుభూతులు - మనల్ని అలాంటి ఆనంద తీరాలవైపే నడిపిస్తాయి!

"అవును తప్పదు; వెంటనే మన ప్రయాణము" అన్నది సత్య వినయంతోనూ పట్టుదలతోను.

"ఐతే, మరి ఈ వజ్ర వైఢూర్యాలతోను మరకత మాణిక్యాలతోను నింపిన నగలతో పట్టు పీతాంబరాలతో కాదు. నీవు అలంకరణ మార్చుకోవాలి. ఒక సాధారణ యాత్రీక దంపతులుగా వెళ్లాలి మనము" అన్నాడు శ్రీకృష్ణుడు సత్యాదేవి ఏమంటుందో అని శంకిస్తూనే.

"దానికేమి!" అని ఒక్క తృటిలో తన వేషధారణను మార్చుకు వచ్చినది. శ్రీకృష్ణుడున్నూ సాధారణ వ్యక్తిగా తయారయ్యాడు.

• • •

విశాలమైన పొగడ తోటలో పూచిన పొన్న పువ్వులతో నిండిన చెట్లగుంపు మధ్య చలువరాతి ఆలయము. ఆ ప్రశాంతత వర్ణనాతీతము. ఆలయ మధ్య భాగములో నిలువెత్తున వేణుగోపాల విగ్రహము. నెమిలిపింఛమును ధరించి ఒక ప్రక్కకు తలవంచి వేణుగానలోలుడై ఉన్న తన నాథుని చలువరాతి స్వరూపము చూచి విస్మయ మందినది సత్యాదేవి. ఒక పర్యాయము ఇటు తిరిగి ఘూర్జర దుస్తులలోనున్న శ్రీకృష్ణుని వంక చూచినది ఆమె. అతడు చిరునవ్వు నవ్వాడు.

ఉదయపువేళ, జనసంచారమేలేని ఆ చోట, విగ్రహము చుట్టూ ప్రదక్షిణము చేస్తూన్న భక్తురాలిని చూచారు వారు. సర్వాలంకృతయై ఉండవలసిన ఒక దేవేరి ఒక్క సాధారణ భక్తురాలు లాగ విగ్రహము చుట్టూ తిరుగుతోంది, వంచిన తలతో, మందగమనమున.

శ్రీకృష్ణుడు సైగ చెయ్యగా విగ్రహానికి అల్లంత దూరాన నేలపైననే కూర్చున్నది సత్యాదేవి. కనక పీఠము తప్ప వేరు తావుల విశ్రమింపని ఆమె ఈ నిమిషము నాథుని సరసనే కఠిన శిలపైన కూర్చోడానికి శంకింపలేదు. ఇద్దరూ ప్రదక్షిణము చేస్తూన్న భక్తురాలివైపు చూస్తూ అట్టే ఉండిపోయారు. విగ్రహము మాత్రము సత్యాదేవికి నిమిష నిమిషము విస్మయము కలిగిస్తోంది. ఎంతటి జీవకళతో రాణిస్తోంది, నాథుని చలువరాతి ప్రతిరూపము. వేయిసార్లు, లక్ష పర్యాయాలు తన కౌగిటిలో కరగిపోయిన ప్రేమమూర్తి రూపమేగా ఇది!

ప్రదక్షణము పూర్తిచేసుకొని అరవికసిత అరవింద ములతో విగ్రహమునకు పాదపూజ చేస్తున్నది భక్తురాలు మీరా బాయి. ధూప దీప నైవేద్యములతో ఆరాధిస్తున్నది విగ్రహాన్ని దిశదిశాంతములకు పరమ శాంతిని ప్రకటించే చిరుగంటను వాయిస్తూ కర్పూర హారతి అందించినది వినమిత మస్తకురాలై ఆ మహారాణి.

మరు నిమిషము ప్రక్కనున్న వాద్యమును, చేబూని మృదుమధురస్వరముతో గిరిధరుని కీర్తింప సాగినది ఇలా... "మేరేతో గిరిధరగోపాల — గిరిధర గోపాలా" ...గొంతెత్తి గానము చేయుచున్నది భక్తురాలు. వేయి చెవులిచ్చి వింటున్నది సత్యాదేవి. తన ప్రియుని గురించేనా ఈ సంకీర్తనము!

పాడుతూ పాడుతూ చటుక్కున లేచి చిడతలను చేబూని బంగరు గజ్జియలు ఘల్లు ఘల్లుమన పాటకు సరిగా నృత్యము చేయసాగినది మీరాదేవి. ఆ నృత్యము లోని అలౌకికత్వము సత్యాదేవిని దిగ్భ్రాంతిలో ముంచి వేసింది. ఎందరు నాట్య కత్తెలను చూడలేదు ఆమె! ఎందరో సుప్రసిద్ధ నృత్యవేత్తలు తమ కళా కౌశలాన్ని చూపలేదు ఆమె ఎదుట!... కాని వారెక్కడ. ఈ పట్టపురాణి ఎక్కడ. ఏమి ఆ నృత్యలావణ్యము-ఏమి ఆ భక్తి పారవశ్యము."

నాట్యము త్వరితగతిని దాల్చినది. అడుగులు భూమిని తాకుతున్నట్లే లేదు. మీరాదేవి పెనుగాలికి అల్లలాడిపోతూన్న పోక మొక్కలా సుడి తిరిగిపోతున్నది. ఆమె ఈ లోకములో ఉన్నట్లే లేదు. ఒక భంగిమలో గిర్రున తిరిగి తిరిగి, సొమ్మసిల్లిపోయి తటాలున కుప్ప కూలినట్లు కూలిపోయింది మీర, విగ్రహపు పాదపద్మములపైన. ఆమెకు స్పృహ వచ్చినది.

వెంటనే తన స్థానము నుండి లేచి స్పృహ తప్పిన పట్టపురాణి చెంతకు వెళ్ళినాడు శ్రీకృష్ణుడు. విభ్రాంతితోనూ, కొంత భయకంపముతోను అతనిని అనుసరించినది సత్యాదేవి.

చంధకః శిలావిగ్రహపు పాదములపై లలాటము నుంచి లోకాన్నే మరచిపోయిన మీరాదేవిని తాకినాడు శ్రీకృష్ణుడు. ఆమె ఫాలభాగమును మృదువుగా నిమిరి నాడు అతను. ఆ స్పర్శ ఆమెలో వింత చలనమును కలిగించినది. చంద్రోదయ సమయాన లేవెన్నెల బాలకిరణము సముద్రపు కెరటాలపై చల్లగా తేలివచ్చినట్లు ఆమె దేహమంతా చలించినది. మరొక్క మారు ఆమె నుదుటిని తడవినాడు మృదువుగా, అతి మృదువుగా శ్రీకృష్ణుడు.

కళ్లు తెరవకుండానే మీరాబాయి అన్నది భక్తి పారవశ్యముతో, అతి దీనస్వరముతో—"వచ్చారా! స్వామీ!! ఇన్నాళ్ళకు — ఇన్నాళ్ళకు—నా వేదన ఫలించినదా — స్వామీ—స్వామీ! స్వామీ!"

అంతే. ఇక మాటలేదు.

సత్య ముందుకు రాబోయినది. చూపుడు వేలుతో సైగ చేసి ఆమెను వారించి, శ్రీకృష్ణుడు వెనుదిరిగి అక్కడనుంచి వచ్చివేశాడు. సత్యాదేవి అతనిని అనుస రించినది అడుగులలో అడుగులు వేసుకుంటూ.

* * *

ద్వారకలో ఆ దినమంతా ఏదో మిషపైన శ్రీకృష్ణునికి దూరముగానే ఉండిపోయింది సత్య. "ఏమంత పరధ్యానము దేవిగారిలో, ఎన్నడూ లేనిది!" అనుకున్నారు పరిచారికలు, ఆలోచనానిమగ్న ఐన ఆమెను పరికిస్తూ.

ఆ రాత్రి అంతఃపురానికి వేంచేయవలసిందని కబురు రాలేదు శ్రీకృష్ణునికి. అతడూ అందుకు ఆశ్చర్యపడలేదు.

కానీ, వేకువనే తొలి ఉషఃకాలములో, సత్యాదేవి శయనాగారమున ప్రవేశించాడు అతను. కలలు కంటూన్న ఆమె వద్దకు చేరి, కాళ్ళవైపున పీఠ ముంచుకుని కూర్చుని మెల్లగా ఆమె పాదములను తాకినాడు అతను. ఆ స్పర్శతో ఆమెకు మెలకువ వచ్చినది. "అపచారము! అపచారము!" అంటూ చటుక్కున లేచి నిలుచున్న సత్యాదేవి, శ్రీకృష్ణుని అపాదమస్తకమూ తిలకించి హఠాత్తుగా అతనికి సాష్టాంగ దండప్రమాణ మొనరించినది. అతని పాదపద్మములను తన కోమల హస్తములతో గట్టిగా పట్టుకొని "స్వామీ, నా స్వామీ, నా స్వామీ!" అనసాగినది అవేశపరురాలై.

మందస్మితముఖారవిందుడైన శ్రీకృష్ణుడు ఆమెను లేవనెత్తి కౌగిలించుకున్నాడు గట్టిగా, గట్టిగా, మరీ గట్టిగా — ఆమె ఆత్మ అతని ఆత్మలో చేరిపోయిన దేమో నంతటి గట్టిగా. సత్యాదేవికి తెలివిలేదు. ఏదో కలలో మరో లోకాన విహరిస్తూంది ఆమె. అక్కడట ఏదో వింత వెలుగు. ఏదో దివ్యగానము. ఎంతో దూరాన్నుంచి, ఏదో సముద్ర గర్భాన్నుంచి వస్తూన్నట్లు వినిపిస్తున్నాయి ఆమెకు శ్రీకృష్ణుని మృదుమధుర వచనాలు.

"సత్యా! ఇతరులకు నేను దేవుడను—నీకు ప్రియుడను, స్నేహితుడను; నీవాడను—ఎప్పటికి నీవాడను నేను" అని.

ఏదో దివ్య సంగీతము మందిరమంతా వ్యాపించింది. శ్రీకృష్ణుని కౌగిలిలో కరిగిపోయినది సత్యాదేవి. అతనితో ఐక్యమందినది భక్తురాలుగా మారిన ప్రియవనిత.

[కళాసాగర్ (మద్రాసు) 1987 వార్షిక సంచిక నుంచి]

# కన్నవీ విన్నవీ

## ఎక్కడ?

ధనవంతుల అబ్బాయి బీద పిల్లని పెళ్ళి చేసుకున్నా. పేద యువకుడు డబ్బున్న ఇంటి పిల్లని వివాహం చేసుకున్నా ఇద్దరికీ అభిప్రాయ బేధాలు అనేక విషయాలలో వచ్చి ఆ పెళ్ళి విడాకులకు దారి తీయవచ్చనీ అనుకుంటాము. కాని అసలు 'కష్టం' వచ్చేది ఆ 'తేడా' వలన కాదు. మరి 'ఎక్కడ'? డబ్బు ఎలా ఖర్చు పెట్టాలి, ఎప్పుడు ఖర్చు పెట్టాలి, ఎంత ఖర్చు పెట్టాలి, ఎందుకు ఖర్చు పెట్టాలి' అనే విషయాలలో పొంతన కుదరనప్పుడే!

## 'వీడియో' చికిత్స!

అమెరికాలో ప్రతి నిముషానికి ఇద్దరు గుండె పోటు వలన చనిపోతున్నారు. హృద్రోగం రావడానికి కొలెస్టరాల్ కారణమనీ వైద్యులు పేర్కొంటున్నారు. అలా గుండె జబ్బులు వచ్చే చాలా మందికి చికిత్స కోసం, సలహా కోసం డాక్టర్ల దగ్గరకి వెళ్ళే తీరికే ఉండడం లేదు. అందుకే "ఎనిమిది వారాలలో కొలెస్టరాల్ నివారించుకోవడం ఎలా?' అనే వీడియో చిత్రాన్ని ఒక వైద్య సంస్థ రూపొందించింది. కాసెట్ ఇంట్లో వేసుకుని చూసుకుని గుండె నొప్పులని ఇంట్లో ఉండే వంట్లో నుంచి వెళ్ళగొట్టున్నారు అమెరికన్లు!

## మరకల చురకలు!

'మీ బట్టల మీద, వంటి మీద మరకలు పడితే వాటిని సులభంగా పోగొట్టడానికి మేము తయారు చేసిన మందు ఉపయోగించండి. ఖరీదు అయిదు రూపాయిలే! - అని ఒక సంస్థ ప్రకటించింది.

'మీ బట్టల మీద, వంటి మీద పడిన మరకలు తొలగించడానికి మీరు ఏ కంపెనీ మందు వాడినా అవి పోయి, కొత్తవి ఏర్పడవచ్చు. ఈ కొత్త మరకలని మా కంపెనీ మందు వాడి పోగొట్టుకోండి - ఖరీదు అయిదు రూపాయిలే!' అని మరొక సంస్థ ప్రకటించింది.

ఎక్కడా - అమెరికాలో!

## పది పనులు!

ఉదయం లేచిన వెంటనే అమెరికన్ గృహిణులు చేసే పనులలో పది పనులు తప్పక ఉంటాయి. పళ్ళు తోముకోవడం, మొహం కడుక్కోవడం, స్నానం చేయడం, ఈ మూడు కలసి ఒకటిగా వస్తాయి. ఆ తర్వాత రేడియో వినడం, కాఫీ త్రాగడం, పక్క సరిగా వేయడం, టిఫిన్ తయారు చేయడం, భర్తకి తాజా తాజా ముద్దు ఇవ్వడం, పేపర్ చదవడం, టి.వి చూడడం, వ్యాయామం, బట్టలు ఇస్త్రీ చేయడం.

అమెరికాలో దేశ వ్యాప్తంగా జరిపిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి!

## జలుబు!

జలుబు రెండు రకాలుగా పోతుంది. మందు తీసుకుంటే వారం రోజులలో నయమవుతుంది! మందు తీసుకోకపోతే ఏడు రోజులలో కుదురుతుంది!"